
సాక్షి
పల్నాడు
ఆదివారం । 6 । జూలై । 2025



శాకంబరీగా వాసవీమాత

అచ్చంపేట: ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారిని భక్తులు శాకంబరీగా అలంకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.70 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 3,146 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నృసింహుడికి సహస్ర దీపాలంకరణ

మంగళగిరి: మంగళాద్రిలో వేంచేసి వున్న లక్ష్మీనృసింహస్వామికి శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనిమచ్చారు.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌లో 852 కేసులు పరిష్కారం



నరసరావుపేట టౌన్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం స్థానిక మండల న్యాయ సేవా అధికారులు న్యాయస్థాన భవనం ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13 అదనపు జిల్లా న్యాయ అధికారి ఎన్.సత్యశ్రీ ఆధ్వర్యంలో న్యాయాధికారులు ఆరు బెంచ్‌లుగా ఏర్పడ్డారు. సివిల్, క్రిమినల్, ముందస్తు వ్యాజ్యాలు, అన్ని రకాల కేసులు కలిపి 852 కేసులను పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ. 5,49,30,445ల మేరకు పరిహారం లభించింది. అదాలత్‌లో న్యాయాధికారులు కె.మధుస్వామి, ఎన్.లావణ్య, ఆర్.ఆశీర్వాదం పాల్, ఎ.సలోమి, ఎం.గాయత్రి, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు రూ.లక్ష విరాళం



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డు పులుపులవారి వీధిలో వేంచేసియున్న వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు పట్టణానికి చెందిన లక్ష్మీ నరసింహా జువెల్లరీ మార్ట్ అధినేత దద్దాల వెంకటేశ్వరరావు, పుష్పలత దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన దాతలు విరాళం మొత్తాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు వనమా కృష్ణ, వనమా సాంబశివరావు, కోవూరు శివశీనుబాబులకు అందజేశారు.

స్వామివారికి వెండి కిరీటం



గురజాల: పల్నాడు యాదాద్రిగా పేరుగాంచిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దేవాలయంలో వేంచేసియున్న వేంకటేశ్వర స్వామి వారికి 5 కిలోల వెండి కిరీటాన్ని శనివారం భక్తులు అందించారు. గురజాలకు చెందిన కనిగిరి సాంబశివరావు, గుండా రవితేజ, జూలకంటి మణికుమార్ రెడ్డిలు స్వామి వారికి అందించారు. తొలి ఏకాదశి ముందు రోజు శనివారం స్వాతి నక్షత్రం కావడంతో స్వామి వారికి కిరీటం అందజేశామని దాతలు తెలిపారు. వెండి కిరీటానికి దేవాలయ అర్చకుడు వేణు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజగోపురం తలుపునకు మరమ్మతులు



అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి అమరేశ్వరస్వామి దేవస్థానం దక్షిణరాజగోపురానికి అమర్చిన రెండు తలుపుల్లో ఒక తలుపునకు ఉన్న ఇనుపరాడ్ విరిగిపోవటంతో గత బుధవారం రాత్రి ఒరిగిపోయింది. ఈనేపధ్యంలో ఆలయ ఈఓ రేఖ ఆధ్వర్యంలో మంగళగిరి నుంచి తలుపులు మరమ్మతులు చేసే వడ్రంగి నిపుణులను పిలిపించి క్రేన్ సాయంతో మరమ్మతులు పూర్తి చేశారు.

కొండ పండుగకు వేళాయె!

వినుకొండ కొండపై నేడు తొలి ఏకాదశి తిరునాళ్ల

- లక్షమందికి పైగా భక్తులు వచ్చే అవకాశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయ, మున్సిపల్, రెవెన్యూ శాఖలు
- కొండపైకి 40 బస్సులు ఏర్పాటు
- 400 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు





వినుకొండ రామలింగేశ్వరస్వామి బాలాలయం ముందు భక్తుల కోలాహలం (ఫైల్) (ఇన్‌సెట్‌లో) రామలింగేశ్వర స్వామి మూలవిరాట్

వినుకొండ: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వరాలయం తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏడాదిలో ముందుగా వచ్చే తొలిఏకాదశి పండుగకు, రామలింగేశ్వరస్వామి తిరుణాళ్లకు లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారు. దేవదాయశాఖ, రెవెన్యూ మున్సిపల్, పోలీస్ శాఖల సమన్వయంతో కొండపై అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హయాంలో కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. ఘాట్‌రోడ్డు మార్గాన ఆర్టీసీ ఆధ్వర్యంలో 40 బస్సులను నడుపుతున్నారు.

అన్నదానం ఏర్పాట్లు


కొండపైకి వచ్చే భక్తుల సౌకర్యార్థం విశ్వహిందూ పరిషత్, వాసవీక్లబ్ లతోపాటు పలు స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, తాగునీరు, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభలు, సాంఘిక, పౌరాణిక నాటకాలు, కోలాటం, భజనలు జరగనున్నాయి.

ఎస్‌ఎస్పీ గ్రౌండ్‌లో విద్యుత్ ప్రభల ఏర్పాటు, జూనియర్ కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

అఖండజ్యోతికి ప్రత్యేక ఏర్పాట్లు



కొండపైన అఖండజ్యోతి

హిమాలయ బాబా ఆధ్వర్యంలో కొండపైన అఖండజ్యోతి ప్రజ్వలనకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండుటన్నుల ఆవునెయ్యితోపాటు 2 వేల మీటర్ల వత్తిని వెలిగించనున్నారు.

పటిష్ట భద్రత ఏర్పాట్లు

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 400 మంది పోలీసులతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. అలాగే 300 మంది మున్సిపల్ కార్మికులు, దేవదాయ, స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో వలంటీర్లు సేవలు అందించనున్నారు.

కోటప్పకొండపై..



కోటప్పకొండ ఆలయ వ్యూ

నరసరావుపేట రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేశారు. ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, అభిషేక దర్శనాలను భక్తులకు కల్పించనున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మూలవిరాట్ అభిషేకాలను నిలిపివేశారు. అభిషేక మండపంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో భక్తులు అసౌకర్యానికి గురికాకుండా ఆలయ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేశారు. తాగునీరు అందుబాటులో ఉంచారు. అలాగే స్వామి వారి ప్రసాదాలైన లడ్డూ, అరిసెలను సిద్ధం చేశారు. భక్తులు స్వామివారిని ప్రశాంతంగా దర్శించుకునేలా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ఈఓ డి.చంద్రశేఖర రావు తెలిపారు.

వైకుంఠపురం



విశేషాలంకారంలో వైకుంఠపుర వేంకటేశ్వరుడు

అమరావతి: మండలంలోని వైకుంఠపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం తొలి ఏకాదశి పండుగను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథ్ శనివారం తెలిపారు. అమరావతి, తుళ్ళూరు, తాడికొండ, మండలాల నుంచి భక్తులు వేలాదిగా స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారన్నారు. కొండమీదకు వెళ్లే భక్తులకు దారిలో మంచినీరు, ఉత్తరవాహిని స్నానఘట్టంలో స్త్రీలకు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త వాసిరెడ్డి సుధాస్వరూప్, గ్రామస్తుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులకోసం ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరికీ ఉచిత ప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వైభవంగా జగన్నాథుని రథయాత్ర



నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో శనివారం శ్రీజగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో పూరీ క్షేత్రం తరహాలో యాత్ర కొనసాగింది. మహిళా భక్తబృందాల కోలాటాలు, హరి సంకీర్తనలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. మరో అశ్వవాహన రథంపై శ్రీశ్రీ వేదాంత ప్రభు మూర్తిని అలంకరించారు. రథయాత్ర సత్తెనపల్లి రోడ్డు, మల్లమ్మ సెంటర్, పల్నాడురోడ్డు మీదుగా ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల సమీపంలోని కోమల కన్వెన్షన్ వరకు కొనసాగింది.

అధికారులు సమన్వయంతో పనిచేయండి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్

నరసరావుపేట: పేద మహిళలకు అందించే పథకాలపై సమన్వయంతో అన్నిశాఖల అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం వివిధ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించి ఏసీఎల్‌పీ యాన్యువల్ క్రెడిట్ లక్ష్లీహుడ్ ప్లాన్‌పై సమీక్ష చేశారు. ఇందులో భాగంగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘం సభ్యులకు దీనిలో వచ్చిన అంశాలు ఆధారంగా వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక, జిల్లా పరిశ్రమలు, ఫిషరీస్, పట్టు పరిశ్రమలు, ఖాదీబోర్డు, హ్యాండ్లూమ్ శాఖలు జిల్లాలోని డ్వాక్రా సంఘ మహిళలకు అవసరమైన పథకాలు వివరించడంలో ఎటువంటి మార్గదర్శకాలను పాటించాలనే విషయం తెలియచేశారు.

చుక్కల భూముల సమస్యలను పరిష్కరించండి..

నరసరావుపేట: జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న 22 ఏ జాబితాలో పడిన చుక్కల భూములను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. కార్యాలయంలో శనివారం జేసీ సూరజ్ గనోరేతో కలిసి సమీక్షచేశారు. మూడు రెవెన్యూ డివిజన్లకు సంబంధించి 22ఏ లిస్టులోని భూములు ఎవరెవరికి చెందినది, వారికి ఎలా సంక్రమించిందనే వివరాలను భూముల రికార్డుల ఆధారంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా భూములను సరైన ఆధారాలు చూపించిన వాటిని వెంటనే తీసుకొని అర్హత కలిగిన వారికి 22ఏ నుంచి తొలగించాలని ఆదేశాలు ఇచ్చారు. డీఆర్‌ఓ మురళి, ఆర్డీఓలు కె.మధులత, రమణా రెడ్డి, మురళీకృష్ణ, కలెక్టర్ ఆఫీస్ రెవెన్యూ సూపరిండెంట్ నాగిరెడ్డి, తహసీల్దార్లు దానియేలు, జి.శ్రీనివాస్, కిరణ్, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జూలై 10న పండగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ (పీటీఎం 2.0) సమావేశం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

గతంలో కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పరిమితమైన పీటీఎంలో ఈ విద్యాసంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలను సైతం భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో 3.04లక్షల మంది తల్లిదండ్రులు భాగస్వామ్యం కానున్నారన్నారు. ఉదయం తొమ్మిది నుంచి ఒంటి గంట వరకు సమావేశం జరుగుతుందన్నారు. అదేవిధంగా అమ్మ పేరుతో ఒక మొక్కను ప్రతి విద్యార్థికి అందించడం జరుగుతుందని, ఆ మొక్కకు సంబంధించి వారికి గ్రీన్ పాస్‌పోర్టు అందజేస్తామన్నారు. అందులో ఆ మొక్క వివరాలు అదేవిధంగా మొక్క ఎదుగుదలను సంబంధించి ప్రతి మూడు, ఆరు నెలలకు ఒకసారి నమోదు చేసి గ్రీన్ పాయింట్లను యాడ్ చేయడం జరుగుతుందన్నారు.

వృథా.. అన్నదాతల వ్యథ

- బుగ్గవాగు డ్యాం మరమ్మతులతో వృథాగా సాగర్ జలాలు
- ఆరు గేట్లలో నాలుగు ధ్వంసం
- నీటి నిల్వ లేక అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఎండిపోతున్న బోర్లు, పంటలు ..
- రైతుల గగ్గోలు
- సాగు, తాగు నీటికి తీవ్ర కటకట



ధ్వంసమైన బుగ్గవాగు రిజర్వాయర్ గేట్లు

దుర్గి: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా నియోజకవర్గంలో మైనర్ రిజర్వాయరైన బుగ్గవాగు డ్యాం మరమ్మతులకు నోచుకోలేదు. పల్నాడు జిల్లా, ముఖ్యంగా మాచర్ల, గురజాల నియోజకవర్గ ప్రజల వరధాయిని లాంటి బుగ్గవాగు డ్యాం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం వాడుకలో ఉన్న రిజర్వాయర్‌ను సక్రమంగా రైతులకు అందుబాటులోకి తీసుకురాలేకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఉంది. సాగర్ కుడికాలువ నుంచి బుగ్గ వాగు డ్యాంకు నీటిని సరఫరా చేసి ఇక్కడ నుంచి కుడికాలువకు నీటిని సరఫరా చేస్తూ లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేయటమే ఈ రిజర్వాయర్ ప్రధాన ఉద్దేశ్యం. మాచర్ల, గురజాల నియోజక వర్గాలతో పాటు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఈ రిజర్వాయర్ నుంచి నీరు సరఫరా అవుతుంది.

అల్లాడుతున్న రైతాంగం

ఖరీఫ్ సీజన్‌లో ముందస్తు వర్షాలు వస్తున్నాయని వాతావరణ శాఖ ప్రకటించటంతో రైతాంగం మే మొదటివారం నుంచి ముందస్తుగా వేలాది ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. అయితే వర్షాలు సరిగా పడక, డ్యాంలో నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డారు. ఈ విషయమై రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా వారి గోడు ఆలకించేవారే కరువయ్యారు. ప్రస్తుత సీజన్‌కు నీటి సరఫరా రానున్న తరుణంలో హడావుడిగా రెండు షట్టర్లకు తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహిస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో డ్యాంను ఆపరేట్ చేసి షట్టర్లను బాగు చేస్తేనే రైతులకు, ప్రజలకు మేలు జరుగుతుంది.

పాడైన నాలుగు గేట్లు

బుగ్గవాగు డ్యాంకు సంబంధించి మొత్తం ఆరు గేట్లు పనిచేస్తుంటాయి. వీటిలో నాలుగు ధ్వంసం కావటంతో వాటిని ఆపరేటింగ్ చేయకపోవటంతో వచ్చిన నీరు వచ్చినట్లు కిందికి వెళ్లిపోతోంది. దీంతో కనీస నీటిని నిల్వ చేయలేకపోతున్నారు. రిజర్వాయర్ మొత్తం కెపాసిటీ 3463టీఎంసీలు, డెడ్ స్టోరేజీ కెపాసిటీ 1.698టీఎంసీలు. కానీ షట్టర్లు ధ్వంసం కావటంతో జలాశయంలో నీరు అడుగంటుతోంది. మొత్తంగా నీటి లెవల్ 475.58టీఎంసీలు అందుబాటులో ఉండటం లేదు.



అడ్డుకట్ట నుంచి లీకవుతూ వృథాగా పోతున్న నీరు

తాగునీటికి అల్లాడిపోతున్నాం



ఊరి బోర్లలో నీరు లేకపోవటంతో బుగ్గవాగు డ్యాం నుంచి పైపుల ద్వారా మా గ్రామానికి తాగునీటి సరఫరా అవుతుంది. డ్యాంలో కనీస నీటిమట్టం లేకపోవటంతో తాగునీరు రావటం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకొని నీటిని నిల్వ చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలి. – ఎం.సాంబయ్య, కంచరగుంట

బోర్లు ఎండిపోయాయి



డ్యాంలో కనీస నీటిమట్టం ఉన్నట్లయితే మా గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో వేలాది బోర్లలో సమృద్ధిగా నీరు వచ్చి పంటలు సాగు చేసుకునేవారం. డ్యాంలో నీరు నిల్వ లేకపోవటంతో మొత్తం బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. దీని మూలంగా వేలాది ఎకరాల్లో పత్తిపంట ఎండిపోయింది.

– తోటకూర వెంకటేశ్వర్లు, రైతు

రెండు గేట్లకు అనుమతులు వచ్చాయి

బుగ్గ డ్యాం ఆరు గేట్లలో రెండు గేట్లు ధ్వంసమైన నేపథ్యంలో వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపాం. రెండు గేట్లకు నిధులు కేటాయించింది. గత పదిహేను రోజులుగా మరమ్మతులు నిర్వహిస్తున్నాం. మరో 15 రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి నీరు వృథాకాకుండా చర్యలు తీసుకుంటాం. మిగిలిన వాటిని త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

– శివయ్య, జేఈ, ఎన్ఎస్‌పీ డ్యాం

అమ్మో.. తొలి ఏకాదశి?!

- పర్వదినం రోజున వినుకొండలో ఏదో క ఘర్షణ
- గత ఏడాది ఇదేరోజున రషీద్ హత్య
- పట్టణంలో పటిష్ట భద్రత
- 42 మందిపై బైండోవరు కేసులు
- 82 సీసీ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు
- 400 మంది పోలీసులతో భద్రత



వినుకొండ పట్టణ వ్యూ

వినుకొండ: తొలిఏకాదశి వినుకొండ వాసులకు పెద్ద పండుగ. సంక్రాంతి తరువాత ఇళ్లన్నీ కళకళలాడేది ఈ పర్వదినం నాడే. బంధువులు, స్నేహితులు, కన్నబిడ్డలు ఇలా.. ఒకరేమిటి బంధుగణమంతా ఎక్కడ ఉన్నా.. ఇక్కడి తమ వారిండ్లకు తరలివచ్చి తొలిఏకాదశి పర్వదినాన్ని ఆస్వాదించి మరునాడు తిరిగి ఎవరిళ్లకు వారు వెళ్లే సంప్రదాయం ఎప్పటి నుంచో ఉంది. మెట్ల మీదుగా కొండపైకి వెళ్లి స్వామిని దర్శించి పరవశించేవారు. చుట్టపక్కల గ్రామాల నుంచే కాకుండా లక్ష మందికి పైగా భక్తులు వినుకొండకు పెద్ద ఎత్తున తరలివస్తారు. కానీ ఇవాళ ఈ పండుగ పేరు చెబితేనే స్థానికుల్లో వణుకు పుడుతోంది. ఎందుకంటే, గత ఏడాది ఇదే పర్వదినం నాడు జరిగిన ఘటనే ప్రధాన కారణం. దేశవ్యాప్తంగా సంచలనం కల్గించిన రషీద్ అనే యువకుడిని రోడ్డుపైనే అత్యంత కిరాతకంగా హతమార్చారు. ఈ హత్యలో 29 మందిని నిందితులుగా గుర్తించారు. గతంలో కూడా తొలిఏకాదశి పండుగ రోజునే పలు చెదురు మదురు ఘర్షణలు జరిగాయి. అయితే ఈ ఏడాది ఎటువంటి ఘర్షణలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరగాలని పట్టణ వాసులు కోరుకుంటున్నారు.

పటిష్ట బందోబస్తు



గతేడాది రషీద్ హత్య నేపథ్యంలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశాం. తిరునాళ్లకు జిల్లావ్యాప్తంగానే కాకుండా పక్క జిల్లా నుంచి 400 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాం. కొండపైనా, కింద 82 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కొండ కింద పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను అనుసంధానం చేశాం. ప్రధాన కూడళ్లలో కూడా పటిష్ట భద్రతతోపాటు, ఫ్లైయింగ్ టీంలను ఏర్పాటు చేశాం. గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో 42 మందిపై బైండోవరు కేసులు నమోదు చేశాం. కొంత మందిని హౌస్ అరెస్టు చేశాం. మరికొంత మందిని ఊరు విడిచి పెట్టి వెళ్లాలని ఆదేశాలిచ్చాం. గత నాలుగు రోజుల నుంచి రాత్రి 10 గంటలకే వ్యాపార దుకాణాలు మూసివేయిస్తున్నాం. పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉంది.

– శోభన్ బాబు,
సర్కిల్ ఇన్‌స్పెక్టర్, వినుకొండ

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పగడాల

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వినుకొండ నియోజకవర్గానికి చెందిన పగడాల వెంకటరామిరెడ్డిని పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీచేసింది.

సహకారంతోనే సత్వర అభివృద్ధి

నరసరావుపేట ఈస్ట్: సహకారంతోనే సత్వర సామాజిక, దేశాభివృద్ధి సాధ్యపడుతుందని, ఈ లక్ష్య సాధనకై సహకార సంఘాలు పని చేస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని జిల్లా సహకార కార్యాలయంలో శనివారం 103వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా అధికారి నాగరాజు మాట్లాడుతూ, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో సహకార సిబ్బంది విధుల్లో మార్పులు చోటుచేసుకుంటాయనీ, అందుకు అనుగుణంగా సిబ్బంది కంప్యూటర్‌తో పాటు ఇతర నైపుణ్యాలు సాధించాలని కోరారు. ఈసందర్భంగా డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి కె.తిరుపతయ్య సిబ్బందిచే సహకార ప్రతిజ్ఞ చేయించి సహకార సూత్రాలు వివరించారు. సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో డబుల్ మేజర్ విధానం అమలు చేయాలి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం కళాశాల డిగ్రీ విద్యలో సింగిల్ మేజర్ విధానం అమలు చేయాలని నిర్ణయించటంపై ఆక్టా – ఏపీ నిరసన వ్యక్తం చేసింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉన్నత విద్య సమావేశంలో సింగిల్ మేజర్ విధానం కొనసాగించాలని నిర్ణయించటం సరికాదని ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహనరావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. సింగిల్ మేజర్ విధానం వలన విద్యార్థులకు, అధ్యాపకులకు ఎటువంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. అధ్యాపక సంఘాల అభ్యర్థన మేరకు డబుల్ మేజర్ విధానం రూపొందించి సబ్జెక్టుల ఎంపిక తుది దశకు చేరుకుంటున్న తరుణంలో తిరిగి సింగిల్ మేజర్ తీసుకురావటం సరికాదన్నారు.

మున్సిపల్ కార్మికుల గోడు పట్టదా?

- సమ్మెలోనే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు
- పది రోజులుగా వివిధ రూపాల్లో దీక్షలు, నిరసనలు
- ఉద్యోగ భద్రత, వేతనాల పెంపునకు డిమాండ్
- సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఈనెల 12 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్న వైనం
- జిల్లాలోని 8 మున్సిపాలిటీల్లో 500 మంది ఇంజినీరింగ్ కార్మికులు



సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శనలో కార్మికులు (ఫైల్)

సత్తెనపల్లి: మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల ఆవేదనను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వీరి సమస్యల పరిష్కారానికి కనికరం చూపడం లేదు. పలుమార్గాల్లో నిరసనలు, ఆందోళనలు తెలిపినా కార్మికులకు గత్యంతరం లేక సమ్మెబాట పట్టారు. జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, మాచర్ల, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మున్సిపల్ కార్యాలయాల వద్ద గత 10 రోజులుగా ఇంజినీరింగ్ విభాగంలోని ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్క్స్ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారు. పట్టణాల్లో రోడ్ల నిర్వహణ, తాగు నీరు, విద్యుత్ సరఫరాలో వీరి సేవలు కీలకం. వీరంతా సమ్మెలో ఉండడంతో పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

కూటమి ప్రభుత్వ వంచన...

తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో కూటమి నాయకులు ప్రకటించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన తల్లికి వందనం పథకం వారికి అమలు చేయలేదు. జిల్లాలోని 8 పురపాలక, నగర పంచాయతీల్లో సుమారు 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారంతా తల్లికి వందనం పథకానికి అర్హులైనా అమలు చేయలేదు.

ప్రధాన డిమాండ్లు

- కార్మికులకు టెక్నికల్ జీతం రూ. 29,200, నాన్ టెక్నికల్ రూ. 24,500 అమలు చేయాలి.
- కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం సంక్షేమ పథకాలు ఇవ్వాలి.
- హెచ్ఆర్ పాలసీ పరిధిలోకి తీసుకురావాలి.
- కార్మికులందరికీ మినిమం టైమ్ స్కేల్ వర్తింప చేయాలి. ఇంకా పలు డిమాండ్లు.

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి



మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. గత నెల 25 నుంచి వివిధ రూపాల్లో నిరసనలు చేపడుతున్నాం. సమస్యలు పరిష్కారం కాకపోతే 12 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి. ప్రధానంగా ఉద్యోగ భద్రత, పనికి తగిన వేతనం లేదు. కొత్తగా చేరిన వారికి పాత వారికి ఒకే జీతం ఉండకూడదు. సర్వీస్ అర్హత గుర్తించి ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– సిలార్ మసూద్, గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ యూనియన్, పల్నాడు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపు నిచ్చారు. కోటప్పకొండరోడ్డులోని సంఘం కార్యాలయంలో శనివారం గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో గోపాలరావు మాట్లాడారు. కేంద్రం మద్దతు ధరల చట్టం తీసుకవస్తానని రాతపూర్వకంగా హామీ ఇచ్చినా అమలులోకి రాలేదన్నారు. అలాగే కార్మికలోకాన్ని కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. గిట్టుబాటు ధరల చట్టం తీసుకురావటంతో పాటు కేరళ తరహాలో రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల సాధనకై తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు సిహెచ్.సురేష్‌రాజా, ముని వెంకటేశ్వర్లు, జి.జాలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

నీటి మోటార్ల దొంగలు అరెస్ట్

నాలుగు మోటార్లు స్వాధీనం



వేటపాలెం: పొలాల్లో సాగు నీటికి ఉపయోగించే మోటార్లు దొంగిలించే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.జనార్దన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ కొత్తపాలేనికి చెందిన రైతు మర్రి నాగార్జున తమ పంట పొలాలకు ఉపయోగించే నీటి మోటార్లు దొంగతనానికి గురైనట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కొణిజేటి చేనేత కాలనీలో నివాసం ఉంటున్న షేక్ నాసిర్ వాలి, వేటపాలెం మార్కెట్ సెంటర్‌లో నివాసం ఉంటున్న షేక్ సుభాని.. ఇద్దరు చెడు వెసనాలకు అలవాటు పడి పొలాల్లో ఉండే మోటార్ల దొంగతనానికి పాల్పడ్డారు. ఈ మేరకు నిందితులు ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 5 హెచ్‌పీ మోటార్లు మూడు, 2 హెచ్‌పీ మోటార్లు రెండు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.1.10 లక్షలు ఉంటుందన్నారు. నిందితులిద్దరినీ చీరాల కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

15న జిల్లా అథ్లెటిక్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో ఉదయం 9 గంటలకు జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌తోపాటు వయస్సు ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. ఎంపిక చేసిన జిల్లా జట్టును ఆగస్టులో బాపట్లలో జరగనున్న రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు.

నేడు అండర్–14 పికిల్ బాల్ పోటీలు

వివివి హెల్త్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని క్లబ్‌లో అండర్– 14 బాల బాలికల ఓపెన్ పికిల్ బాల్ పోటీలు నిర్వహిస్తామని క్లబ్ డైరెక్టర్ టి.అరుణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

కొరిటిపాడు (గుంటూరు): జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 40 మంది అధికారులను 13 టాస్క్ ఫోర్స్ బృందాలుగా ఏర్పాటు చేసి ఏకకాలంలో తనిఖీలు చేశారు. గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని పలు విత్తన దుకాణాలు, మాన్యుఫాక్చరింగ్, ప్రాసెసింగ్ యూనిట్లు, రిటైల్, హోల్ సేల్ దుకాణాల్లో శనివారం ఈ తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నట్లు గమనించామని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఆ విత్తనాల అమ్మకాలను నిలిపివేశామన్నారు. రూ.4.72 కోట్ల విలువైన 704.84 కిలోల మిర్చి విత్తనాలు, రూ.5.65 లక్షల విలువ గల మరో 293.85 కిలోల ఇతర విత్తనాల అమ్మకాలను నిలిపివేశామని పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాద దృశ్యం

హాలియా: అతివేగంగా దూసుకొచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన 565వ నంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా గురజాలకు చెందిన మోరం నాగేశ్వరరావు, ఆయన భార్య లక్ష్మీపార్వతి, 18 నెలల కుమారుడు అభిరామ్‌తో కలిసి శనివారం బైక్‌పై నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల గ్రామంలో శుభ కార్యానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ముగ్గురు కలిసి బైక్‌పై వెళ్తుండగా.. మార్గమధ్యలో అనుముల మండలం కొత్తపల్లి గ్రామ సమీపంలోకి రాగానే హాలియా నుంచి సాగర్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఎస్ఐ సాయిప్రశాంత్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో సాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితులను మాచర్లకు తరలించారు. క్షతగాత్రుల బంధువు లక్ష్మీకాంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపారు.

సమగ్ర ఆరోగ్య ప్రచారం

నరసరావుపేట రూరల్: మండలంలోని రావిపాడులో శనివారం సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశానుసారం జిల్లా వైద్యారోగ్య శాఖ, ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ ఆధ్వర్యంలో 104 సిబ్బందితో కలిసి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సుమారు 40మందికి హెచ్ఐవీ, సిఫిలిస్ పరీక్షలతో పాటు హెపటైటిస్ బీ, సీ రక్త పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీఆర్ జోయెల్ ప్రసాద్, ఏఎన్ఎం నాగమల్లేశ్వరి, ఐసీటీసీ కౌన్సిలర్ రవి తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర ఆరోగ్య ప్రచారంలో పాల్గొన్న సిబ్బంది

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

ప్రెగ్నెన్సీ యాక్ట్‌పై డీఎంహెచ్ఓ సమీక్ష

నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వ హాస్పిటళ్లలో ప్రసవాల సంఖ్య పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శనివారం తన చాంబర్‌లో కమిటీ చైర్మన్ హోదాలో జిల్లా స్థాయి ప్రెగ్నెన్సీ యాక్ట్–1971 అమలు తీరుతెన్నులపై సభ్యులతో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ చట్టం కింద లీగల్‌గా అబార్షన్స్ చేసేందుకు రెండు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో సక్రమంగా ఉన్న దరఖాస్తుదారులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మంజూరు చేసేందుకు కమిటీ ఆమోదం తెలియచేస్తుందన్నారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ రవి మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ వైద్యశాలలు, ప్రైవేటు అల్ట్రా సౌండ్ స్కాన్ సెంటర్లు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదన్నారు. అలా చేస్తే తీవ్ర నేరంగా పరిగణించి జరిమానా, జైలుశిక్ష, గుర్తింపు సర్టిఫికెట్లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏరియా హాస్పిటల్ గైనకాలజీ విభాగం అధిపతి డాక్టర్ కె.విజయలక్ష్మి, పీడియాట్రిషన్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఫిజీషియన్ డాక్టర్ ఎస్.గిరిరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు డి.శివకుమారి ప్రోగ్రాం ఆఫీసర్ డెమో కె.సాంబశివరావు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో సమీక్ష చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రవి

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రైస్‌మిల్లు దగ్ధం

రూ.10లక్షల మేర ఆస్తినష్టం

నకరికల్లు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రైస్‌మిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని కుంకలగుంట గ్రామంలో శనివారం తెల్లవారుఝామున జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. షేక్ జాన్‌సాహెబ్, అరవపల్లి ప్రదీప్‌లు భాగస్వామ్యంతో గ్రామంలోని మసీదులైన్‌లో రైస్‌మిల్లు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి కార్యకలాపాలు ముగించుకొని వెళ్లిపోయారు. శనివారం తెల్లవారుఝామున మిల్లులో మంటలు రావడం గమనించిన సమీప గృహాల వారు మిల్లు నిర్వాహకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనలో మిల్లులోని యంత్రాలు, ధాన్యం, బియ్యం బస్తాలు కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. నిర్వాహకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ చల్లా సురేష్ కేసు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కుంకలగుంటలో దగ్ధమైన రైస్‌మిల్లు

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో చీఫ్ విప్ జీవీ, జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి ముందే ఘర్షణ

వినుకొండ: టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు పదవులకోసం ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునారావుల ముందే బాహాబాహీకి దిగారు. వివరాల్లోకి వెళితే.. వినుకొండ మార్కెట్‌యార్డ్‌లో శనివారం టీడీపీ మండల, గ్రామస్థాయి సంస్థాగత పదవుల ఎన్నికకు రంగం సిద్ధం చేశారు. అయితే శావల్యాపురం మండలం అధ్యక్ష పదవి కోసం ఏకంగా ముగుర్గు వ్యక్తులు పోటీపడటంతో సమస్య తలెత్తింది. మూడు గ్రూపులుగా విడిపోయిన తెలుగు తమ్ముళ్లు నాయకులముందే బాహాబాహీకి దిగారు. మూడు గ్రూపులు వాదులాడుకుంటూ గందరగోళం చేశారు. ఎవరు చెప్పినా వినకపోవటంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవ పెద్దది కాకుండా చర్యలు చేపట్టారు. దీంతో శావల్యాపురం మండలం ఎన్నికను తాత్కాలికంగా వాయిదా వేశారు. అలాగే గ్రామస్థాయి ఎన్నికల్లో కూడా పలు గ్రామాల నాయకులు అభిప్రాయ బేధాలు రావటంలో నాయకులు తలలు పట్టుకున్నారు.

కల్తీ మద్యం తయారీ ముఠా అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు

రేపల్లె: కల్తీ మద్యం తయారు చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. రేపల్లె మండలం మోళ్లగుంట గ్రామంలో కల్తీ మద్యం తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. గ్రామంలోని మోపిదేవి సతీష్ గృహాన్ని పరిశీలించారు. గృహంలో కల్తీ మద్యం తయారు చేసే ముడి సరుకుతోపాటు మద్యం నిల్వ ఉంచే టిన్‌లు, క్వార్టర్ సీసాలు కనిపించాయి. మోళ్లగుంటకు చెందిన మోపిదేవి సతీష్, కన్నా రాములతోపాటు కృష్ణాజిల్లా గుల్లలమోద గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి సూర్యలను అదుపులోకి తీసుకున్నారు. మోపిదేవి సతీష్, సూర్య, రాములతోపాటు మరో ముగ్గురు కలిసి గత కొన్ని సంవత్సరాలుగా అక్రమ కల్తీ మద్యం తయారు చేస్తున్నట్లు విచారణలో గుర్తించారు. ఇథనాల్ ఆల్కహాల్ 10 లీటర్లు, 21 ఖాళీ క్యాన్‌లు, 510 ఖాళీ సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రధాన సూత్రధారి అయిన యానం శ్రీను అలియాస్ నులికుర్తి శ్రీనివాస్ హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి ఇథనాల్ ఆల్కహాల్‌ను సతీష్‌కు పంపుతాడు. ఆల్కహాల్‌లో రంగు నీరు కలిసి సతీష్, సూర్య, రాములు 180 మిల్లీలీటర్ల సీసాలలో నింపి చుట్టు ప్రక్కల ప్రాంతాలలో విక్రయిస్తూ అక్రమంగా నగదు సంపాదిస్తున్నాడు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన యానం శ్రీను, రూతుల శ్రీనివాస్ , చరణ్ జిత్‌లను త్వరలో అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ అధికారి తెలిపారు. వీరిరువురికి హైదరాబాద్‌లో ఉన్న నకిలీ మద్యం తయారీ ముఠాతో సంబంధాలు ఉన్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. సమావేశంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జనార్దన్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ మధుబాబు, ఎక్సైజ్ సీఐ దివాకర్, ఎస్ఐలు రాజ్యలక్ష్మి, రామారావు పాల్గొన్నారు.